క్లుప్తంగా

శృంగార వల్లభుని దర్శనానికి భక్తుల బారులు



భక్తుల నుంచి పూజలందుకున్న తిరుపతి శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. వివిధ మార్గాల ద్వారా స్వామివారికి రూ.1,75,966 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 10 వేల మంది స్వామి వారిని దర్శించుకోగా మూడు వేల మందికి ప్రసాద వితరణ, అన్నదానం చేశారు.

రామాయణంపై రేపు టాలెంట్ టెస్టు

సామర్లకోట: రామాయణంపై విద్యార్థులలో అవగాహన పెంచడానికి సోమవారం టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు మదర్ థెరిసా స్వచ్ఛంద సంస్థ అధినేత జి.రాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో 7, 8, 9 తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. వంద ప్రశ్నలలో అత్యధిక మార్కులు వచ్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తామన్నారు.

15న మహా మాల గర్జన



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న భగవాన్

సామర్లకోట: ఈనెల 15వ తేదీన గుంటూరు జిల్లా నల్లపాడులో జరిగే మాల మహా గర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ భగవాన్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక పెన్షన్‌లైన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలు మనువాదులని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, మతవాద పార్టీల పంచన చేరి మాలలను మనువాదులు అనడం గొంగళిపై కూర్చుని వెంట్రుకలు ఏరుకున్నట్లుందని ఎద్దేవా చేశారు. వందల ఏళ్ల నుంచి కలిసి మెలిసి జీవిస్తున్న మాల, మాదిగల మధ్య చిచ్చు పెడుతున్నారని భగవాన్ ఆరోపించారు. కాకినాడ జిల్లా నుంచి చలో మాల సభకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు వినకోట సురేష్ తెలిపారు. శిబిరంలో భాగంగా ఉచిత సుగర్, బీపీ పరీక్షలు చేయనున్నారు. పరీక్షలకు వచ్చే వారు ఉదయం ఏ విధమైన ఆహారం తీసుకోకుండా హాజరుకావాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.



మల్లవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



జి.రాగంపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



తాటిపర్తిలో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



తాటిపర్తిలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

షణ్ముఖా.. సుబ్రహ్మణ్యేశ్వరా..

- వైభవంగా షష్ఠి వేడుకలు
- తాటిపర్తి, మల్లవరంలో పోటెత్తిన భక్తులు
- కన్నులపండువగా స్వామివారి కల్యాణం



చదలాడలో పుట్టల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పిఠాపురం: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో శనివారం కన్నులపండువగా జరిగాయి. గ్రామాల్లోని స్వామివారి ఆలయాలకు తెలవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. పండితులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి, మల్లవరం, గొల్లప్రోలు, చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వేకువజామునుంచి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఉద్యోగులు, వ్యాపారులు సుదూర ప్రాంతాల నుంచి భారీగా తరలిరావడంతో మల్లవరం, తాటిపర్తి రోడ్లు వాహనాల రద్దీతో నిండిపోయాయి.

కల్యాణం.. కమనీయం

తాటిపర్తిలో 87వ షష్ఠి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. స్వామివారికి ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అపర్ణా కళా తోరణంలో వేదపండితులు స్వామివారి దివ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక, సమీప గ్రామాలకు చెందిన భక్తులు ఆలయం వద్ద ఉన్న పుట్టల్లో పాలు పోసి పూజలు చేశారు. స్వామివారికి సామూహిక అభిషేకాలు జరిపారు. సుమారు 90 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉగ్రమండపాల్లో మహిళలు రాత్రి నుంచి ఉపవాస దీక్ష చేపట్టారు.



తాటిపర్తిలో సంతానం కోసం ఉగ్ర మండపాల్లో నిద్రిస్తున్న భక్తులు

బారులు తీరిన భక్తులు

గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి, మల్లవరం, గొల్లప్రోలు, చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు బారులుతీరారు. సుమారు 1.30 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. గంటల తరబడి క్యూలైన్లలో ఉండి స్వామిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానాలు ఏర్పాటు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్ విష్ణు, జనసేన ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, ఎస్వీఎస్ఎన్ వర్మ, జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా శనివారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు వైభవంగా జరిగాయి. కొమరగిరిలోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వార్షిక కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. రాత్రికి స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర ఆలయంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం షష్ఠి వేడుకలు జరిగాయి. ఈఓ బళ్ల నీలకంఠం దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. అనంతరం మెర్ల అన్నపూర్ణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆలయంలోని నంది మండపం వద్ద వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరస్వామి, అళ్లకి రాజ్‌గోపాల్ కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. శ్రీకాకుళపు వినయ్, సన్నిధిరాజు అంజిబాబు, భాస్కర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్త సంఘ సభ్యులు బిక్కిన పరమేశ్వరసాయి, తలుపుల అంజనీకుమార్, బీవీ రమణ, చల్లా సత్తిబాబు భక్తులకు సేవలందించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. అలాగే స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని జగదీశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో, మండల పరిధిలోని పనసపాడులోని సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ చీకట్ల వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు.



కొమరగిరిలో విశేష అలంకరణలో స్వామివారు

భక్తులకు పాలు, బిస్కెట్లు పంపిణీ

మండల పరిధిలోని వీకే దేవం గ్రామంలోని శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బిక్కవోలులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠిని పురస్కరించుకొని 3000 వేల మందికి పాలు, బిస్కెట్లు పంపిణీ చేసినట్లు సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ శనివారం సాయంత్రం తెలిపారు. సమితి సభ్యులు పాల్గొన్ని భక్తులకు సేవలు చేసినట్లు తెలిపారు.

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాండవుల మెట్టపై వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, మండలంలోని చదలాడ, జి.రాగంపేట, చంద్రమాంపల్లి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు వేకువ జాము నుంచే భక్తులు క్యూ కట్టారు. చదలాడలో ఆరు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు వసతులు ఏర్పాటు చేశారు. సీఐ క్రాంతికుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక బందోబస్తు ఏర్పాటు చేశారు. యువతులు నాగుల చీరలు ధరించి స్వామిని దర్శించుకుని రాత్రి అక్కడ విశ్రమించేలా కమిటీ ఏర్పాట్లు చేసింది. స్వామి వారిని గ్రామంలో ఊరేగించి శూలాల సంబరం నిర్వహించారు. అలాగే స్థానిక ప్రత్తిపాడు–సామర్లకోట రహదారిలోని జి.రాగంపేటలో కొలువై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర దర్శనానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

ట్రాఫిక్ సమస్యకు మోక్షం ఎప్పుడో?



ఫ్లైఓవర్ నుంచి స్టేషన్ సెంటర్ వరకు నిలచిపోయిన వాహనాలు

సామర్లకోట: పట్టణ పరిధిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో చిన్న వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో గంటల తరబడి వాహన చోదకులు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. ఫ్లైఓవర్‌పై అడుగడుగునా గోతులు ఏర్పడడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. శనివారం సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఇక్కడి గోతుల వల్ల నెమ్మదిగా వెళ్లడంతో వాహన చోదకులు తీవ్ర అసహనానికి గురయ్యారు. దాంతో బ్రిడ్జి నుంచి స్టేషన్‌సెంటర్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఫ్లైఓవర్ నుంచి ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్స్ వరకు కాకినాడ రోడ్డులో రైల్వే గేటు వరకు వాహనాలు బారులు తీరాయి. ఉదయం, సాయంత్రం సమయంలో భారీ వాహనాలకు, గడ్డి వాహనాలకు అనుమతి లేకుండా చేస్తే ట్రాఫిక్ సమస్య కొంత వరకు తీరుతుందని స్థానికులు అభిప్రాయం పడుతున్నారు. ఫ్లైఓవర్‌పై గోతులను తక్షణమే మరమ్మతు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పెద్దాపురంలో ఆటల పోటీలు ప్రారంభిస్తున్న డిఈఓ రమేష్



సామర్లకోట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సీఈఓ లక్ష్మణరావు



మూలపేటలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వేణుగోపాల్

- జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు
- పేరెంట్స్ మీట్‌లో హామీ

సామర్లకోట: పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇక్కడ మహిళా జూనియర్ కళాశాల ఉండడంతో దానిని డిగ్రీ కళాశాలగా చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. బ్రౌన్‌పేట ముఖద్వారం వద్ద మున్సిపాలిటీ అనుమతి ఉంటే ఈ పాఠశాల, కళాశాలకు ఆర్చి ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానన్నారు. ఏజెన్సీల భోజనం నాశిరకంగా ఉంటే స్థానికంగా వంటలు చేసుకొనే ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమానికి హెచ్ఎం యు మీనామాధురి అధ్యక్షత వహించగా ఎంఈఓ–1 వై.శివరామకృష్ణయ్య, కౌన్సిలర్ పాలిక కుసుమ, విద్యాకమిటీ చైర్మన్ భవాని తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని పలు ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీట్‌లు జరిగాయి. ఎంఈఓతో పాటు, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఈ సమావేశాలను పరిశీలించారు.

తల్లిదండ్రుల సహకారం అవసరం : డీఈఓ

పెద్దాపురం: విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని డీఈఓ పి.రమేష్ అన్నారు. స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించారు. డీవైఈఓ ప్రభాకర శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సును వెలికితీయడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం అవసరమన్నారు. అనంతరం తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్ తదతర ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు

పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

కొత్తపల్లి: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయ, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి, పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. పలు పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు వేణుగోపాల్, షైడిరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వేణుగోపాల్ మట్లాడుతూ పిల్లల భవిష్యత్తు విద్యతేనే ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయండి

- ఆర్డీఓ మల్లిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మల్లిబాబు

సామర్లకోట: ఈనెల పదో తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల విజయవంతానికి వీఆర్వోలు, సర్వేయర్లు కృషి చేయాలని ఆర్డీఓ ఎస్.మల్లిబాబు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇప్పటికే మండల పరిధిలో రీ సర్వే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నందు వల్ల రైతుల నుంచి ఏఏ సమస్యలు వస్తాయో ముందుగా తెలుసుకోవచ్చునని, దీనిని దృష్టిలో ఉంచుకుని రైతుల సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు రికార్డులను సదస్సులో ఉంచుకోవాలని సూచించారు. భూ సమస్యలపై కోర్టుకు వెళ్తే ఇరు వర్గాలకు నష్టం జరిగే అవకాశం ఉందని వివరించాలని సూచించారు. సమావేశానికి తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి అధ్యక్షత వహించగా, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, డిప్యూటీ తహసీల్దార్ పద్మజారెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ–1	85558 71069
ఎంఈఓ–2	94410 73418

పశువుల లెక్క ఇక పక్కా

- పశుగణన చేపట్టిన కేంద్ర ప్రభుత్వం
- 120 రోజుల పాటు నిర్వహణ
- మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదు
- టీకాల తయారీ, పథకాల రూపకల్పన వివరాలే ప్రామాణికం



పశుగణన చేపడుతున్న అధికారులు

పెద్దాపురం: కేంద్ర ప్రభుత్వం 21వ పశుగణనకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పశువుల వివరాలు సేకరిస్తున్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, కుక్కల వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. 2025 ఫిబ్రవరి నెలాఖరు వరకూ పశుగణన కొనసాగనుంది. సెప్టెంబర్ 1న ప్రారంభించి డిసెంబర్ 31లోపు ముగించే విధంగా కేంద్రం మొదట షెడ్యూల్ ఇచ్చింది.

స్వాతంత్ర్యానికి ముందు నుంచే పశుగణన

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే పశుగణన జరుగుతోంది. ఇప్పటివరకు 20 సార్లు పశుగణన చేశారు. మొదటి సారి 1919–20లో పశుగణన జరగ్గా తాజాగా 21వ గణనను ప్రారంభించారు. అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పశువులపై ఆరా తీస్తున్నారు. అన్ని రకాల పశువుల వివరాలను లెక్కిస్తారు. వీధి కుక్కలను మాత్రం పరిగణనలోకి తీసుకోరు. వీధి కుక్కలపై గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు ఇచ్చే వివరాలను నమోదు చేస్తారని పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు.

ప్రతి ఇంటికి వెళ్లి నమోదు

పశుగణనకు ఎన్యూమరేటర్లు ప్రతిఇంటికి వెళ్లి ఇంటి యజమాని వివరాలతో పాటు భూమి, పశువుల వివరాలను సేకరించి, వాటిని ప్రత్యేక యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. సంకర జాతి, దేశీయ జాతి పశుసంపదను వేర్వేరుగా సేకరిస్తున్నారు. ప్రతి అంశానికి ఒక విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. మొత్తం 71 కాలమ్స్‌లో పశువులకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పశుగణనకు జిల్లా పశుసంవర్ధకశాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. పశు సంవర్ధకశాఖ సహాయకులు (ఏహెచ్ఏ), ఇతర పారా సిబ్బందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు. ప్రభుత్వ పశువైద్యశాలల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఏరియా అసుపత్రుల ఏడీలు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తున్నారు. పెద్దాపురం మండలంలో 13 మంది, సామర్లకోట మండలంలో 19 మంది వెరసీ నియోజకవర్గ వ్యాప్తంగా పశు సంవర్ధక శాఖ సహాయకులు (ఏహెచ్ఏ) ఉండగా మరో పది మందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు.

పథకాల రూపకల్పనకు అవకాశం

పశుగణనకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పశు గణన ద్వారా గతంలో కంటే పశువుల సంఖ్య పెరిగిందా ? తగ్గిందా ? అనే వివరాలు తెలుస్తాయి. తద్వారా పశువుల కోసం, పశు పోషకుల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలి, పశు వైద్యశాలలు, వైద్యుల సంఖ్యను పెంచాలా లేదా తదితర అంశాలకు ప్రణాళికను రూపొందించేందుకు వీలవుతుంది. టీకాల తయారీ, పథకాల రూపకల్పనకు పశుగణన ప్రామాణికం. పాలు ఇచ్చే పశువులెన్ని.. పాలివ్వని పశువులెన్ని...అనే వివరాలు తెలుస్తాయి. గతంలో కంటే పాడి అవసరం ఎంత మేరకు ఉంది, మందులు సరిపడా ఉన్నాయా.. లేవా అనే వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి. తద్వారా పాడి పరిశ్రమకు ఏ మేరకు నిధులు కేటాయించాలనే దానిపై ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది. పశుగణన ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశు సంక్షేమ కార్యక్రమాలు చేపడతాయి.

పక్కా వివరాలు ఇవ్వండి

పెద్దాపురం నియోజకవర్గంలో 20వ పశుగణన ప్రకారం 7533 ఆవులు, 40751 గేదెలు, 13,503 గొర్రెలు, 6450 మేకలు, 1,32,750 కోళ్లు ఉన్నాయి. 21వ పశుగణన 2025 ఫిబ్రవరి 28 వరకు జరుగుతుంది. ఇందుకోసం సూపర్‌వైజర్లు 10 మంది, 34 మంది ఎన్యూమరేటర్లను నియమించాం. పశువులు ఉన్నా ..లేకున్నా... ప్రతి ఇంటికి ఎన్యూమరేటర్లు వస్తారు. వారికి కచ్చితమైన వివరాలు ఇవ్వాలి. పశు గణనకు ప్రజలు సహకరించాలి.



– తుమ్మల రామస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, పెద్దాపురం